క్లుప్తంగా

ఎమ్మెల్యే వాహనం తనిఖీ



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల స్టేజీ సమీపంలో అధికారులు బుధవారం ఎమ్మెల్యే విజయుడు వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే కారును పార్లమెంట్ ఎన్నికల ప్లెయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ నిర్వహించారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి అధికారులకు సహకరించారు. ప్రజలతో పాటుగా ప్రజా ప్రతినిధులు ఒక్కటేనని, ప్రతి ఒక్కరు అధికా రులకు సహకరించాలని ఎమ్మెల్యే సూచించారు.

సైనిక్ స్కూల్‌కు విద్యార్థి ఎంపిక

మానవపాడు: మండలంలోని చెన్నిపాడుకు చెందిన తల్లిదండ్రులు జగదీష్, ఇంద్రజ్యోతిల కుమారుడు అజయ్ జాస్పర్ కరీంనగర్ రుక్మాపూర్‌లోని సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యాడు. గత మార్చి నెల 10న నిర్వహించిన కామన్ ఎంట్రెన్స్‌లో ఉత్తమ మార్కులు సాధించి ప్రతిభ కనబర్చాడు. ఆ తర్వాత మార్చి 22న కరీంనగర్‌లో నిర్వహించిన ఈవెన్స్‌కు హాజరయ్యాడు. రిటర్న్ టెస్టు, ఫిజిక్ టెస్టు పరీక్షలో ప్రతిభ చాటి స్టేట్ సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యాడు. దీంతో గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.

సంచార జాతులకు ఓఆర్‌ఎస్ పాకెట్ల పంపిణీ

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న సంచార జాతుల వారికి తీవ్రమైన ఎండల వల్ల కలిగే ఇబ్బందుల గురించి వివరించి, వారికి ఓఆర్‌ఎస్ పాకెట్లను వైద్యసిబ్బంది సత్యనారాయణ, చంద్రన్న అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆరోగ్య ఉప కేంద్రాలలో పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందించారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉండటంతో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మట్టి టిప్పర్లను అడ్డుకున్న ప్రజలు

అయిజ: మున్సిపాలిటీ పరిధిలోని పర్దీపురం సమీపంలో గట్టు నుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్లను బుధవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్నారని పేర్కొన్నారు. కొన్ని గంటల పాటు వాహనాల డ్రైవర్లకు, పర్దీపురం గ్రామస్తులకు వాగ్వాదం చోటుచేసుకుంది. మట్టిని తరలించేందుకు మైనింగ్ శాఖ నుంచి అనుమతి తీసుకున్నామని చెప్పినా, వినకుండా గ్రామస్తులు వాహనాలను అడ్డుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. మైనింగ్ శాఖ నుంచి వారు అనుమతి తెచ్చుకున్నారని, వాహనాలను అడ్డుకున్నవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో గ్రామస్తులు వెనక్కు తగ్గారు. యథావిధిగా వాహనాలు మట్టిని తరలించే కార్యక్రమం కొనసాగించారు.

నిర్దేశించిన పనిని పూర్తి చేయాలి

మానవపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని ఆయా గ్రామాల్లో పని చేస్తున్న కూలీలు నిర్దేశించిన పనిని పూర్తి చేయాలని అప్పుడే రూ.300 కూలి వస్తుందని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని ఉపాధిహామీ పథకానికి సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు సగటున దాదాపు రూ.159 కూలీ వస్తుందని, ఫీల్డ్ అసిస్టెంట్ నిర్దేశించిన పనిని పూర్తి చేస్తే రూ.300 కూలీ వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ విజయ్ శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఈత చెట్లు దగ్ధం



అయిజ: మండలంలోని బైనిపల్లి సమీపంలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో ఈత వనం దగ్ధమైంది. బాధితుల వివరాల మేరకు.. పులికల్, బైనిపల్లి గ్రామాలకు సంబంధించిన కల్లు గీత కార్మికులు మూడెకరాల పొలంలో 600 ఈత చెట్లను పెంచారు. బుధవారం ఉన్నట్లుండి ఈత వనం నుంచి మంటలు రావడాన్ని సమీపంలో కొందరు వ్యక్తులు చూశారు. గ్రామస్తులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో ఈతచెట్లు కలిపోయాయి. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని గీత కార్మికులు కోరారు.

గుండెపోటుతో ఉద్యోగి మృతి

అయిజ: గుండెపోటుతో ఉద్యోగి మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాల పట్టణానికి చెందిన మదన్‌మోహన్ (56) అయిజ మండలంలోని ఆర్డీఎస్ మేడికొండ సెక్షన్‌లో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. బుధవారం ఆయన నివాసంలో గెండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మదన్‌మోహన్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయనకు భార్య అనురాధ, కొడుకు, కూతురు ఉన్నారు.

ఎండలోనే పడిగాపులు

- బస్సుల కోసం ప్రయాణికుల పాట్లు
- నీడలేక ఫ్లై ఓవర్ కిందే నిరీక్షణ
- అలంపూర్ చౌరస్తా టూ హైదరాబాద్ ప్రయాణికుల అవస్థలు
- 10 ఏళ్లైనా పట్టించుకోని అధికారులు



అలంపూర్ చౌరస్తాలో ఎండలోనే బస్సు కోసం వేచిచుస్తున్న ప్రయాణికులు

ఉండవెల్లి: అలంపూర్ చౌరస్తాలోని ప్రధాన రోడ్డుపై బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు నిలువ నీడ కరువైంది. రోడ్డు చిన్నగా ఉండడంతో ఒక బస్సు తరువాత మరో బస్సు వేళ్లాల్సింది. పుల్లూరు శివారులోని జాతీయ రహదారిపై నిర్మించిన బస్సు షెల్టర్‌ను కూల్చేయడంతో 6 కి.మీ. మేర అలంపూ ర్ చౌరస్తాకు రావాల్సిందే. ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మండుటెండలోనే రోడ్డుపై నిల్చోని బస్సుల కోసం చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. త ప్పని సరి పరిస్థితిలో ఫ్లెక్సీల చాటున, చిరు దుకాణాల వద్ద, ఫ్లై ఓవర్ కింద వేచి ఉంటున్నారు.

బస్సుల కోసం వేయిటింగ్..

అలంపూర్ చౌరస్తాలోని ఒక చోట బస్‌షెల్టర్ నిర్మించినా, బస్సులు మాత్రం మరో చోట నిలుస్తాయి. ప్రయాణికులు ఎక్కడ అధికంగా ఉంటే అక్కడ బస్సులు ఆపుతున్నారు. గద్వాల్, మహబూబ్‌నగర్, వనపర్తి, కొల్లాపూర్, షాద్‌నగర్, జడ్చర్ల, కొత్తకోట, హైదరాబాద్‌లకు బస్సు సౌకర్యాలు ఉన్నా అవి మాత్రం కర్నూల్ జిల్లా నుంచి వచ్చేంత వరకు వేచి చూడాల్సిందే.

అలంపూర్‌కు ఆటోలే దిక్కు..

దేశంలో ఐదో శక్తిపీఠంగా మార్మోగుతున్న ఆలయానికి బస్సులు కరువు. ప్రయాణికులు ఆటోలు, జీపుల్లోనే వెళ్తున్నారు. సెలువులు ఉండడంతో తెలంగాణ జిల్లాలోని పలు జిల్లాల నుంచి ఉచిత బస్సు సౌకర్యంతో అలంపూర్ చౌరస్తాకు చేరుకుంటారు. కాని అలంపూర్ చౌరస్తా నుంచి వెళ్లడానికి బస్సులు కరువయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం ప్రవేశ పెట్టినా అలంపూర్ నియోజకవర్గంలో బస్సుల కొరత, మినీ బస్సుల కొరత అధికంగా ఉంది. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు కావడంతో అలంపూర్ చౌరస్తాలో బస్ డిపోను నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



అలంపూర్ ఆలయాల దర్శనానికి వెళ్లేందుకు ఆటోల కోసం భక్తుల నిరీక్షణ

అధికారులు ఆలోచించాలి..



గ్రామీణ ప్రాంతాలకు బస్సులే రావు. మరి దూర ప్రాంతాలకు ప్రయాణించాలంటే బస్సులు ఉండాలి. బస్సులు కర్నూల్ నుంచి రావాలి. అంత వరకు ఎండతీవ్రత అధికంగా ఉంటుంది. ఫ్లై ఓవర్ కింద నిల్చోవాలంటే మిగతా వాహనాల వల్ల ఇబ్బందిగా ఉంటోంది. బస్సు డిపోను ఏర్పాటు చేసి, ప్రయాణికులకు నీడను ఏర్పాటు చేయాలి.

– ఆనంద్‌కుమార్, ఉండవెల్లి

బస్సులను ఆపేందుకు ప్రయత్నిస్తాం..



బస్సు షెల్టర్ వద్దే బస్సులు ఆపేందుకు ప్రయత్నిస్తాం. అలంపూర్ ఆలయాలకు నాలుగు బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తాం. ఎన్నికలు పూర్తయిన తర్వాత బస్సు డిపో గురించి ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తాం. ప్రతి గ్రామానికి బస్సును త్వరలో ఏర్పాటు చేస్తాం.

– మంజుల, డిపో మేనేజర్, గద్వాల్

కాంగ్రెస్‌తోనే ప్రజలకు న్యాయం



నందిన్నెలో ఎన్నికల ప్రచారం చేస్తున్న సరిత

కేటీదొడ్డి: కాంగ్రెస్‌తోనే ప్రజలకు న్యాయం దక్కుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. మండలంలోని నందిన్నె గ్రామంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఎంపీ అభ్యర్థి మల్లురవికి ఓటు వేసి గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గీత, మధుసూదన్‌బాబు, వీరన్న, మహదేవ్‌ఉన్నారు.

ఉండవెల్లి: రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కేంద్రంలో బీజేపీ గ్రాఫ్ పడిపోయిందని వచ్చేది ఇందిరమ్మ రాజ్యమని మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవిని గెలిపించాలని ఇంటింట ప్రచారం నిర్వహించారు. అనంతరం మారమునగాల–2 నుంచి భారీగా కాంగ్రెస్‌లోకి కార్యకర్తలు చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గోపాల్, ఉపాధ్యక్షులు నాగరాజు, జిల్లా నాయకులు రమేష్, సీపీఎం నాయకులు మద్దిలేటి, వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ధరూరు: రాష్ట్రంలో కేసీఆర్‌ను ఏ విధంగా గద్దె దింపి ఇంటికి పంపించామో, అదే విధంగా కేంద్రంలో నరేంద్రమోదీని గద్దె దింపేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బండారి భాస్కర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బీసీఏస్‌ఆర్ కాంప్లెక్స్‌లో కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాజారెడ్డి, తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, జాకీర్ పాల్గొన్నారు. మండలంలోని ధరూరు, మన్నాపురం, ఉప్పేరు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం చేపట్టారు.

కేటీదొడ్డి: తెలంగాణకు అన్యాయం చేసిన బీజేపీని ఓడించి ఇండియా కూటమి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవిని గెలిపించుకుందామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని పాతపాలెం, ఈర్లబండ, నీలహళ్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు ఎన్నికల బ్రోచర్‌ను విడుదల చేశారు.

అయిజ: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పట్టణంలోని వివిధ కాలనీల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

గద్వాల రూరల్: గద్వాల పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎంపీ అభ్యర్థి మల్లు రవిని గెలిపించాలని పట్టణంలో 9,24,25 వార్డులలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గంజిపేట శంకర్, శ్రీమన్నారాయణ, శ్రీను, మహేష్, ఇసాక్, కోటేష్, భాస్కర్‌యాదవ్, నాగేందర్ యాదవ్ పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని వేములలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు.

రాజోళి: మండల కేంద్రంతో పాటు పచ్చర్ల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరుగుతూ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

గట్టు: మండలంలోని తప్పెట్లమొర్సులో కాంగ్రెస్ నాయకులు ఇంటింట ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు గట్టు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఇంటింటా తిరుగుతూ నాగర్‌కర్నూలు ఎంపీ అభ్యర్థి మల్లురవిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రంగస్వామిగౌడు, ముక్కెరన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘బంగ్లాలు వదిలిన బాణమే గొంగళ్ల రంజిత్‌కుమార్’

గద్వాల అర్బన్: గత అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ వాదాన్ని అడ్డం పెట్టుకొని రెండు బంగ్లాలతో లోపాయికారి ఒ ప్పందం కుదుర్చుకొని, బీసీ బిడ్డను ఓడించిన ఘనుడు గొంగళ్ల రంజిత్‌కుమార్ అని కాంగ్రెస్ పార్టీ మాజీ అ ధికార ప్రతినిధి శెట్టి ఆత్మకూర్ లక్ష్మణ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు బంగ్లాలు వదిలిన బాణమే గొంగళ్ల రంజిత్‌కుమార్ అని, బహుజన వాదాన్ని తుంగలో తొక్కి బంగ్లా పంచాన చేరారని, ఈ విషయాన్ని నడిగడ్డ ప్రజలు గమనిస్తున్నారన్నారు. నడిగడ్డ హ క్కుల కోసం పోరాటం చేయలేదని, సొంత, స్వార్థ ప్రయోజనాల కోసం పోరాటం చేశారని తెటతెల్లమైందన్నారు. బీసీ నాయకురాలిని ఓడించినందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాగేంద్ర యాదవ్, తుమ్మల నర్సింహులు, శ్రీనివాస్ గౌడ్, జమ్మన్న, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలి

గట్టు: ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిర్భయంగా స్వచ్ఛందంగా వినియోగించు కోవాలని ఎంపీఎం సాంబశివుడు, పంచాయతీ కార్యదర్శి సురేష్‌లు కోరారు. బుధవారం అంతంపల్లిలో మహిళా సంఘాల సభ్యులతో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీఎం, కార్యదర్శి మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఓటర్ల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీసీలు రామకృష్ణ, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సామాన్యుల నడ్డి విరుస్తున్న బీజేపీని గద్దెదించాలి



గద్వాలలో మాట్లాడుతున్న ఆంజనేయులు

గద్వాల అర్బన్: జాతి సంపదను కార్పొరేట్ యాజమాన్యాలకు దారదత్తం చేస్తూ, మత విద్వేషాలను రెచ్చగొట్టడం, విపరీతంగా ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్న బీజేపీని గద్దెదించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవికి మద్దతుగా జిల్లా కేంద్రంలోని పాతబస్టాండులో ప్రచారం నిర్వహించారు. సీపీఎం ఆధ్వర్యంలో గద్వాల మండలంలోని తెలుగొనిపల్లి, ముల్కాల్‌పల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నాయకులు ఉన్నారు.

ధరూరు: మత విద్వేశాలను రెచ్చగొట్టడంతో పాటు నిత్యవసర ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరిచిన బీజేపీని ఓడించేందుకు ప్రతి ఒక్కరు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బీ ఆంజనేయులు అన్నారు. ఆయన మండల కేంద్రంతో పాటు మండలంలోని పారుచర్ల, సోంపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల హమాలీ, సీపీఎం నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో హమాలీ సంఘం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం

ఎర్రవల్లిచౌరస్తా: ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో గడపగడపకు తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు కరపత్రాలు పంచుతూ ఎన్నికల ప్రచారం చేపట్టారు. 13న నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బలపర్చిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని వారు కోరారు.

కేటీదొడ్డి: మండలంలోని పాతపాలెంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్, రంగస్వామి, కృష్ణ, వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పాతపాలెంలో నాయకుల ప్రచారం

బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలి



కార్నర్ మీటింగ్ నిర్వహిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

గద్వాల అర్బన్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ గెలుపు కోసం కృషి చేయాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆ సమితి కార్యాలయంలో ముఖ్య నాయకులకు ఓటింగ్ యంత్రంపై అవగాహన కల్పించారు.

అయిజ: నరేంద్రమోదీని మూడోసారి ప్రధాన మంత్రిని చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని పులికల్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానం బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని తిమ్మాపురం, షేకుపల్లి గ్రామాల్లో బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇటిక్యాల మండలాధ్యక్షుడు అబ్దుల్లా ఉదండాపురం, బుద్దారెడ్డిపల్లిలో ప్రచారం చేశారు.

మల్దకల్: కేంద్రంలో బీజేపీ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని బీజేపీ అభ్యర్థి భారత్‌ప్రసాద్ అన్నారు. మల్దకల్, సద్దోనిపల్లి, అమరవాయి, బిజ్వారం, మేకలసోంపల్లి, ఉలిగేపల్లి, దాసర్‌పల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని తిమ్మాజిపల్లిలో గడప గడపకు బీజేపీ ప్రచారం చేపట్టారు. కరపత్రాలు ప్రజలకు పంచుతూ ప్రచారం కొనసాగించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరసింహులు, మండల ప్రధాన కార్యదర్శి బీకే శ్రీను, అయ్యరాజు, రంగస్వామి పాల్గొన్నారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు



శాంతినగర్‌లో గోవుకు హారతి ఇస్తున్న మహిళలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అమావాస్యను పురస్కరించుకుని భక్తులు, రాజకీయ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదిశిలా క్షేత్రంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు వేరువేరుగా పూజలు నిర్వహించారు. గద్వాల పట్టణంలోని కాకతీయటెక్నో స్కూల్ యజమాన్యం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నడిగడ్డ పోరాట హక్కుల సమితి అధ్యక్షుడు రంజిత్‌కుమార్, రాములు, విష్ణు, చింతకిష్టన్న, ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, కాకతీయ టెక్నో స్కూల్ శ్రీకాంత్‌జోషి, రాముడు పాల్గొన్నారు.

ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి, అల్వలపాడు తెలుగోనిపల్లి ఆంజనేయస్వామి ఆలయం, ధరూరు ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

గోమాతకు ప్రత్యేక పూజలు

శాంతినగర్: అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం, మహిళాసంఘం ఆధ్వర్యంలో గోవుకు పశుగ్రాసంతో పాటు పళ్లు, కూరగాయలు సమర్పించారు. అనంతరం కర్పూరం వెలిగించి గోమాతకు కర్పూర హారతి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ శివారులో ఆర్డీఎస్ కెనాల్ సమీపంలో వెలసిన శ్రీ భ్రమరాంబసమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

ఉండవెల్లి: మండలంలోని డీ బూడిదపాడు ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు ఆకుపూజ నిర్వహించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి గీతాలతో భజనలు చేశారు. సీతారాముల విగ్రహాలను పల్లకీలో ఆలయం చుట్టు భక్తులు ఊరేగించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రాజోళి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. చారిత్రాత్మక వైకుంఠ నారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో వెలిసిన అంజనేయస్వామి సన్నిధిలో అమావాస్యను పురస్కరించుకుని స్వామి వారికి బిందె సేవ, ఆకు పూజ, అర్చనలు, భజనలు, సంకీర్తనలతో పూజలు చేశారు. అనంతరం అన్నదానంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

కేటీదొడ్డి: మండలంలోని పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి ఆయా ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య కావడంతో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించుకున్నారు.



కల్యాణోత్సవ కార్యక్రమంలో భాగంగా ఊరేగింపులో పాల్గొన్న భక్తులు